క్లుప్తంగా

బాట గంగమ్మకు పూజలు


అంబలి తీసుకొస్తున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని ఏటూకూరిపల్లెలో వెలసిన బాటగంగమ్మకు శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గ్రామంలోని మహిళలు అమ్మవారికి పొంగళ్లు, అంబలిని సమర్పించారు. మధ్యాహ్నం పాల బిందెలతో ఊరేగించి అమ్మవారికి పాలాభిషేకం చేశారు.

జీవామృతంతో చీడపీడల నివారణ


విత్తనాలు అందజేస్తున్న డీపీఎం వాసు

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జీవామృతంతో చీడపీడలు నివారించవచ్చని డీపీఎం వాసు తెలిపారు. శుక్రవారం రైతులకు శ్రీకావేరిరాజుపురంలో జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. అనంతరం కూరగాయలు సాగు చేసుకోవడానికి విత్తనాలు పంపిణీ చేశారు.

బర్డ్‌ఫ్లూపై అవగాహన అవసరం


కోళ్లఫారంను పరిశీలిస్తున్న డీడీ గోవిందయ్య

శ్రీరంగరాజపురం: బర్డ్‌ఫ్లూపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ గోవిందయ్య అన్నారు. మండలంలోని మొదవాడ, మత్రిపల్లి వద్ద ఉన్న కోళ్ల ఫారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చికెన్‌ను బాగా ఉడికించి తినాలన్నారు. కోళ్లఫారంలో కోళ్లు ఏవైనా చనిపోతే వెంటనే సమీప పశువైద్యశాఖ వైద్యులను సంప్రదించాలన్నారు. ఏడీ రూపాసుందరి, మండల పశువైద్యాధికారి శ్రీ విద్య పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకారం కోడి ఉత్సవం


ఊరేగింపుగా వస్తున్న ఉత్సవర్లు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం సాయంత్రం శ్రీకారం కోడి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను గ్రామాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం తిరుమండ్యం పంచాయతీ ఎనమల పాలెంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ప్రతి రైతూ తాను పండించిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో విజయ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

పేడ దిబ్బలపై డీపీవో ఆగ్రహం


అధికారులతో మాట్లాడుతున్న డీపీవో

విజయపురం: మండలంలో నెలకొన్న అపరిశుభ్రతపై డీపీవో సుధాకర్ మండిపడ్డారు. జగన్నాథపురం పంచాయతీలో శుక్రవారం ఆయన పర్యటించారు. రోడ్డుకు ఇరువైపులా పేడదిబ్బలను చూసిన ఆయన స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చేతిపంపు, తాగునీటి కొళాయి, పైపులైన్ మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ఆయన వెంట ఎంపీడీవో రాజేంద్రన్ ఉన్నారు.

వనదుర్గాపురంలో పల్లెనిద్ర


పల్లెనిద్రలో మాట్లాడుతున్న ఎస్‌ఐ

పాలసముద్రం: పోలీసుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేందుకు పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. శుక్రవారం మండలంలోని వనదుర్గాపురం పంచాయతీలో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులతో మాట్లాడు తూ.. గ్రామాల్లో చిన్న చిన్న గొడవలతో కేసులు పెట్టుకుని కోర్టు చుట్టూ తిరగకుండా సోదరుల్లా కలిసి మెలసి జీవనం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహ రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెరుకు సాగు.. లాభాలు బాగు


శ్రీకావేరిరాజుపురం సాగులో బెట్ట కట్టిన చెరుకుతోట

జిల్లాలో అధికంగా సాగయ్యే పంటల్లో చెరుకు కూడా ఒకటి. అయితే చెరుకు సాగు చేసిన కొన్ని జాగ్రత్తలు పాటిస్తే బెల్లానికి మార్కెట్ అధిక డిమాండ్ ఉన్న నేపథ్యంలో లాభాలు గడించవచ్చు. చెరుకు పంటను కొన్ని రకాల పురుగులు, తెగుళ్లు ఆశించి నష్టపరుస్తుంటాయి. వాటిని సకాలంలో గుర్తించి తగు చర్యలు తీసుకోవడంతో పాటు సేంద్రియ ఎరువులు వాడితే తెల్ల బెల్లం వస్తుంది. తద్వారా అధిక ఆదాయం పొందవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

- పంటలో తెగుళ్లను అరికడితే అధిక దిగుబడి
- సేంద్రియ ఎరువులు వాడితే తెల్లబంగారానికి మరింత డిమాండ్
- చెరుకులో బెట్ట నివారణే కీలకం

పాలసముద్రం: మండలవ్యాప్తంగా చెరుకు సాగు అధికంగా ఉంది. ముఖ్యంగా మండలంలోని శ్రీకావేరిరాజుపురం, నిశ్శింకాపురం, బాలకృష్ణాపురం, పాలసముద్రం, కన్నికాపురం, కేజే పురం, ఆముదాల గ్రామాల్లో చెరుకు రైతులు సాగు చేశారు. అయితే ప్రస్తుత తరుణంలో రైతులు చిన్నచిన్న మెలకువలు పాటిస్తే చాలా వరకు చెరుకు పంటలో సమస్యలను అధిగమించవచ్చు.

మొవ్వకుళ్లు, కాండం తొలుచుపురుగు

చెరుకు నాటినప్పటి నుంచి నరికే వరకు ఈ పురుగు ఆశిస్తుంది. బాల్యదశలో పీక పురుగుగా మారి పైరును నష్టపరుస్తుంది. పీక పురుగు వర్షాధారపు పంటను ఎక్కువగా ఆశిస్తుంది. ఈ పురుగు నివారణకు ముందుగానే ముచ్చెలు లోతుగా నాటాలి. మిథైల్‌పారాథియాన్ పొడి ఎకరానికి 10 కిలోల చొప్పున నాటే ముందు సాళ్లలో వేయాలి. వీలును బట్టి తక్కువ వ్యవధిలో దగ్గరగా నీటి తడులు కట్టాలి. ముచ్చెలు నాటిన మూడోరోజున కార్సితోటల్లో (మొదటి కోత కోసిన తరువాత మళ్లీ అదే మొచ్చెపై పంట పండించడం), కార్సి చేసిన వెంటనే ఎకరాకు 1.25 టన్నుల చెత్తను కప్పాలి. అలాగే లీటర్ నీటిలో రెండు మిల్లీ లీటర్ల క్వినాల్‌పాస్ కలిపి నాటిన 5, 6, 9 వారాల్లోగా పిచికారీ చేయాలి. అలాగే ట్రైకోగ్రామాఖిలోనిస్ అనే పరాన్న జీవి గుడ్లను ఎకరాకు 20 వేల చొప్పున చెరకు నాటిన 30 రోజుల నుంచి 10 రోజుల వ్యవధిలో నాలుగు సార్లు విడుదల చేయాలి.

కాటుక తెగులు

చెరుకులో కాటుక తెగులు ఆశించిన భాగాలను జాగ్రత్తగా తీసి ప్లాస్టిక్ కవర్‌లో వేసి కాల్చి వేయాలి. తెగులు ఆశించకుండా ఉండాలంటే లీటర్ నీటిలో 1 మిల్లీ లీటరు ప్రాఫికొనజోల్ కలిపి అందులో 30 నిముషాల పాటు నాటక ముందే ముచ్చెలు ఉంచి ఆ తరువాత నాటుకోవాలి. కార్సి తోటల్లో చెరకు నరికిన తరువాత మొదళ్లపై 30 నుంచి 40 రోజులలో లీటర్ నీటిలో 1మిల్లీ లీటరు ప్రాఫికొనజోల్ కలిపి పిచికారీ చేయాలి.


చెరుకు పంటలో సేంద్రియ ఎరువులు వేస్తున్న రైతు

వేరు పురుగు

ఈ పురుగు మొక్కల వేర్లను తినడం వల్ల మొక్కలు చనిపోతాయి. ఎకరానికి 6 నుంచి 10 కిలోల ఫ్లోరేట్ గుళికలు (10 శాతం) నాటే సమయంలో భూమిలో వేయాలి. పైరు ఎదిగే తోటల్లో పురుగు నివారణకు ఫ్లోరేట్ గుళికలు ఎకరానికి 6 కిలోలు మొక్కల మొదళ్ల దగ్గరగా గుంతలు తీసివేయాలి.

ఎర్రనల్లి

ఈ పురుగు తాకిడి ఎక్కువగా ఉంటుంది. వానజల్లులు పడినప్పుడు ఆ జల్లు మధ్య ఒరుపు(ఎడతెరపి లేకుండా) సమయంలో ఈ తెగులు కనిపిస్తోంది. ఆకు అడుగుభాగాన అధిక సంఖ్యలో పురుగులు చేరి రసాన్ని పీల్చడం వల్ల ఆకు ఎర్రగా మారుతుంది. నేలలో తేమ ఉన్న ఆకులు పొడిబారి ఎండిపోతాయి. ఈ పురుగులు కంటికి కనిపించవు. వీటి నివారణకు లీటర్ నీటిలో 3 గ్రాముల వెట్టిబుల్ సల్ఫర్, 8 మిల్లీ లీటర్ల డైకోఫాల్ కలిపి పిచికారీ చేయాలి.

చెదల నివారణ

తేలికపాటి నేలల్లో చెదపురుగులు ఎక్కువగా ఆశిస్తాయి. విత్తనపు ముచ్చెల ఇరువైపుల నుంచి లోపలికి ప్రవేశించి పదార్థం తినడం వల్ల మొలక శాతం తగ్గుతుంది. ఏపుగా పెరుగుతున్న తోటల్లో కూడా లోపలి మెత్తని పదార్థం తినడం వల్ల గడలు గుల్లబారుతాయి. దీంతో దిగుబడి బాగా తగ్గిపోతుంది. నివారణకు చెదపురుగుల పుట్టను తవ్వి రాణి ఈగను చంపాలి. అలాగే ఒక్కో పుట్టకు 200 గ్రాముల మిథైల్ పరాథియాన్ చల్లాలి.

చెరకు సాగులో ఎరువుల వాడకం..

చెరువు సాగుల్లో రసాయనిక ఎరువులు తక్కువగా వాడి సేంద్రియ ఎరువులను సక్రంగా వేసినట్లయితే బెల్లం పంట నరికి బెల్లం తయారు చేస్తున్నప్పుడు బెల్లం తెల్లగా వస్తుంది. మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది. తెల్ల బెల్లం తయారు చేయాలంటే ఎకరానికి ఒక టన్ను పశువుల ఎరువుతో పాటు కొద్దిగా కాంప్లెక్స్ వేయాలి. అది కూడా చెరకు నాటిన రెండు, మూడు నెలలల్లో వేయాలి.

పంటను నిత్యం పరిశీలించాలి..

చెరకు పంటను బెట్ట నుంచి రక్షించుకోవాలి. ఎదుగుదల ఆధారంగా లీటరు నీటికి 25 గ్రాములు, యూరియా+25 గ్రాముల మ్యూరుట్ ఆఫ్ పొటాష్ కలిపి పంటపై పిచికారీ చేయాలి. వర్షాకాలంలో పంట పొలంలో అధిక నత్రజని వాడకం మురుగునీరు నిలబడి పోవడం వల్ల చెరకును ఆశించే పొలును పురుగు, దూదేకుల పురుగు, పిండినల్లి, తెల్లీఈగ ఉధృతిని గమనించాలి. సకాలంలో పంట మొత్తం తడిచే విధంగా మలాథియాన్ 3 మిల్లీ లీటర్లు లేదా మోనో్క్రోటాపాస్ 1.6 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పరామర్శ


పద్మావతమ్మకు నివాళులర్పిస్తున్న నారాయణ స్వామి

గంగాధర నెల్లూరు: మండలంలోని కోట్రకోన గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బాలాజీ రెడ్డి తల్లి పద్మావతమ్మ కొద్దిరోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పద్మావతమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, బాలాజీ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, విజయ శేఖర్, కుషల్ రెడ్డి, కోదండ రెడ్డి, వెంకట రెడ్డి పాల్గొన్నారు.

శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభం


గ్రామ వీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

కార్వేటినగరం: సంతాన వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో వెలసిన కోదండరామ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేకువ జామున స్వామి వారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు నిత్య కై ంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని విశేష ఆభరణాలతో అలంకరించారు. అనంతరం తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవర్ల సమర్పణ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. సాయంత్రం వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. తిరువీధి ఉత్సవం అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామి వారిని ఏకాంత సేవలో పవళింపజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారి సురేష్‌కుమార్, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై కరకంతేశ్వరుడు



నగరి: పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంతేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కరకంతేశ్వర స్వామిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. ఆలయంలో అభిషేక అర్చనలు చేశారు. మాడవీధుల్లో ఊరేగింపుగా వచ్చిన స్వామిని భక్తులను దర్శించుకుని కొబ్బరికాయలు సమర్పించి కర్పూర హారతులు స్వీకరించారు. ఆలయం వద్ద భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మున్సిపాలిటీలో తప్పని పందుల బెడద


రాత్రిళ్లలో వీధుల్లో తిరుగుతున్న పందులు

నగరి: మున్సిపల్ పరిధిలో పందుల సంచారం అధికమైంది. రాత్రిళ్లు కూడా పందుల బెడద తప్పడం లేదు. వీధుల్లో పందులు గుంపులు గుంపులుగా తిరుగుతుంటే చిన్నారులు బయటకు రావడానికి భయపడే పరిస్థితి ఉంది. పలు మార్లు పందుల పెంపకందార్లను పిలిపించి మున్సిపల్ అధికారులు హెచ్చరించినా వారిలో మార్పు రావడంలేదు. సమావేశమైన ప్రతి సారీ కొంత గడువు ఇచ్చి ఆ గడువులోపు జనావాసాల మధ్య పందులను మేపరాదని, దూరపు ప్రాంతాలకు తీసుకెళ్లాలని అధికారులు వారికి సూచిస్తున్నారు. లేకుంటే వాటిని పట్టుకెళ్లిపోతామని, జరిమానా విధిస్తామని ప్రత్యక్షంగా వారిని హెచ్చరిస్తున్నారు. అయితే ఈ హెచ్చరికలను వారు బేఖాతర్ చేస్తున్నారు. యథావిధిగా జనావాసాల మధ్య పందులను వదిలేస్తున్నారు. ఈ అంశంపై కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు భరోసా


సుబ్రమణ్యం, మణిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

విజయపురం: అయినవాళ్లను పోగొట్టుకున్న కుటుంబాలకు తానున్నానంటూ మాజీ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. ఇల్లత్తూరుకు శుక్రవారం వెళ్లిన ఆమె ఇటీవల మృతి చెందిన సర్పంచ్ దీప్తిరాజు, సుబ్రమణ్యం, డీలర్ మణి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన కన్వీనర్ గోపినాథ్ బావమరిది పిల్లల నామకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పాతర్కాడుకు చెందిన సుధాకర్‌రాజు ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ శివరాజు, వైస్ ఎంపీపీ బాలాజీ, నార్పరాజు, గజేంద్రరాజు, సతీష్, గోవర్ధన్ నాయుడు, అరుణాచలం, సుధాకర్, పరంధామన్‌యాదవ్, సుబ్బుయాదవ్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి రోజా పరామర్శ


మాజీ ఎంపీటీసీని పరామర్శిస్తున్న మాజీ మంత్రి

నిండ్ర: మండలంలోని మేళంబాకం మాజీ ఎంపీటీసీ సభ్యులు, ఎస్టీ సెల్ అధ్యక్షులు జయశంకర్‌ను శుక్రవారం మాజీ మంత్రి రోజా పరామర్శించారు. అనారోగ్యంతో వైద్యశాలలో చేరి చికిత్స అనంతరం గ్రామంలో ఉన్న మాజీ ఎంపీటీసీని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని ఆమె వారి కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభా, పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి శ్యామ్‌లాల్, జెడ్పీటీసీ సభ్యులు పరంధామ, మండల కన్వీనర్ వేణురాజు, జిల్లా పార్టీ కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉల్లాసం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ సుమన్

శ్రీరంగరాజపురం: క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యమని ఎస్‌ఐ సుమన్ అన్నారు. మండలంలోని పెద్దతయ్యూరులో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడు తూ.. ఆటల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడలు మనలో ఉన్న ప్రతిభను వెలికితీస్తాయన్నారు. నిర్వాహకులుగా చిరంజీవి, నరేష్, సురేష్, సూర్య, లవకుమార్ వ్యవహరించారు.

సువార్త స్వస్థత సభలు

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరం రాజా వీధిలో వెలసిన యెహోవాఈరే చర్చి పాస్టర్ ఆగస్టీన్ సరోజమ్మ ఆధ్వర్యంలో సువార్త స్వస్థత ఆశీర్వాద సభలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన దేవ సుందరం, రెవ. డాక్టర్ కే.జాషువా ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

వెదురుకుప్పం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మాజీ మంత్రికి సన్మానం


మాజీ మంత్రి రోజాను సన్మానిస్తున్న శ్యామ్‌లాల్, నాయకులు

నిండ్ర: వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి రోజాను శుక్రవారం మండల పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శిగా శ్యామ్‌లాల్‌ను నియమించడంతో, ఆయన పార్టీ నాయకులతో కలిసి మాజీ మంత్రి రోజాను కలిసి సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని శ్యామ్‌లాల్ అన్నారు. మాజీ మంత్రిని కలసిన వారిలోఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభా, జిల్లా పార్టీ కార్యదర్శి అనిల్, మండల పార్టీ కన్వీనర్ వేణురాజు, ఎంపీటీసీ విజేష్, జెడ్పీటీసీ పరంధామ, నాయకులు వీరయ్య, రామచంద్రా రెడ్డి, మునిరాజ్, చంద్రబాబు, బాబురెడ్డి, నామదేవరెడ్డి, గుణ,బసవయ్య, రమేష్, మురళిరాజు, చార్లీ, గోవిందమ్మ పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ ముందు సైరన్ తప్పనిసరి


క్వారీ లీజుదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

పుత్తూరు: పట్టణ పరిధిలోని గ్రానైట్ లీజుదారులు ప్రభుత్వ నిబంధనలను విధిగా పాటించాలని లేనిపక్షంలో లైసెన్స్‌లను రద్దు చేయనున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ నెల 2న ఈశ్వరాపురం సమీప క్వారీలో ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టకుండానే బ్లాస్టింగ్ చేయడంతో ఎగిరిపడ్డ బండరాయి ఒకటి మూడేళ్ల బాలుడికి తలకు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న కలెక్టర్ పుత్తూరులోని గ్రానైట్ క్వారీలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆయన గురువారం ప్రమాదం జరిగిన క్వారీని పరిశీలించి వచ్చిన తహసీల్దార్ శుక్రవారం అన్ని గ్రానైట్ క్వారీ లీజుదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న ఆరు గ్రానైట్ లీజుదారులకు గాను కేవలం ముగ్గురు మాత్రమే సమావేశానికి హాజరుకావడం గమనార్హం. తహసీల్దార్ మాట్లాడుతూ లీజు, ఈసీ క్లియరన్స్, పర్మిట్, బ్లాస్టింగ్ పర్మిషన్ కాపీలను ప్రతి క్వారీ లీజుదారుడు సమర్పించాలని ఆదేశించారు. బ్లాస్టింగ్‌కు ముందు విధిగా సైరన్ మోగించాలని లేనిపక్షంలో లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

చిన్నారులకు చదువు దూరం


రామరాజుకండ్రిగ ఆది ఆంధ్రవాడలో ఇంటి వద్ద ఉన్న పిల్లలు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం రామరాజు కండ్రిగ, ఆది ఆంధ్రవాడ, ఎస్టీ కాలనీ పిల్లలకు చదువు కష్టాలు తప్పడం లేదు. ఓబీఆర్ కండ్రిగ పంచాయతీ రామరాజు కండ్రిగ, ఆది ఆంధ్రవాడ, ఎస్టీ కాలనీల్లో ఆరేళ్లలోపు పిల్లలు సుమారు 10మందికి పైగా ఉన్నారు. పిల్లల తల్లిదండ్రులు ప్రతి రోజు 1.5 కిలో మీటరు దూరంలో ఉన్న బట్టకండ్రిగ అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లి, తీసుకురావటం కష్టంగా ఉండడంతో తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపడం మానేస్తున్నారు. ఫలితంగా పిల్లలు చదువుకోవడానికి వీలులేకుండ పోయింది.

దినసరి కూలీలు

రామరాజుకండ్రిగ, ఆదిఆంధ్రవాడ, ఎస్టీ కాలనీలో చాలా మంది వ్యవసాయ, దినసరి కూలీలు ఉన్నారు. ఉదయం 6గంటలకు పనికి వెళ్లితే సాయంత్రానికి ఇంటికి చేరుకొంటారు. దీంతో తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలను తీసుకెళ్లడం కష్టంగా మారింది. పనిదినం లేని సమయంలో మాత్రమే తమ పిల్లలను బడికి తీసుకెళ్లుతున్నారు. మిలిగిన సమయంలో పిల్లలు ఇంటి వద్దే ఉంటున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రం ఏర్పాటు చేయండి

బట్టికండ్రిగ అంగన్‌వాడీ కేంద్రం దూరంగా ఉండడంతో తమ పిల్లలకు కష్టంగా ఉంది. స్థానికంగా అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే జిల్లా, మండల స్థాయి అధికారులకు అనేక సార్లు అర్జీలు ఇచ్చినట్లు పిల్లల తల్లిదండ్రులు తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.